క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌ను గద్దె దించాలి

మోతె : నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోదాడ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి బెల్లంకొండ నవీన్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని సిరికొండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట నిరుద్యోగులు బెల్లంకొండ జనార్దన్‌గౌడ్, పవన్ పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థి ప్రచారం

నడిగూడెం : కోదాడ అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి, మండలంలోని బృందావనపురం గ్రామానికి చెందిన బెల్లంకొండ నవీన్‌గౌడ్ సోమవారం మండల వ్యాప్తంగా ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించాలని కోరారు.

గిరిబాబుకు నివాళి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు బాచిమంచి గిరిబాబు మృతి పార్టీకి తీరని లోటని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌లో సోమవారం గుండెపోటుతో మృతి చెందిన గిరిబాబు మృతదేహంపై ఆయన కాంగ్రెస్ జెండా కప్పి, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. కాంగ్రెస్ నాయకులు శివారెడ్డి, నాగన్న, మల్లికార్జున్, గూడెపు శ్రీను, అరుణ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, యోహాన్, బాబూరావు ఉన్నారు.

కోదాడలో పోలీస్ కవాతు

కోదాడరూరల్ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు డీఎస్పీ బి.ప్రకాష్ తెలిపారు. సోమవారం కోదాడ పట్టణంలోని పలు వార్డుల్లో కేంద్ర బలగాలు ఐటీబీపీ, స్థానిక పోలీసులతో కలిసి ఫ్లాగ్‌మార్చ్, నాకబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలన్నారు. సీఐ రాము, ఎస్ఐలు యాదవేందర్‌రెడ్డి, రామాంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. పలువురిపై కేసు

మోతె : ఇరువర్గాల ఘర్షణలో పలువురిపై మోతె పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కాంగ్రెస్ కోదాడ అభ్యర్థి పద్మావతి ఆదివారం సాయంత్రం మోతె మండలంలోని భల్లుతండాలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలకు ఎదురుపడ్డారు. దీంతో రెండు పార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దూషణల పర్వానికి తెరలేపారు. ఈ క్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన ఓ కార్యకర్త లు కాంగ్రెస్ కార్యకర్తలపై రాయితో దాడి చేశాడు. దీంతో భల్లుతండాలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరువర్గాల ఫిర్యాదుతో రెండు పార్టీలకు చెందిన పలువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేశా



నిత్యం ప్రజల మధ్యే ఉన్నాను. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేశాను. చుట్టపు చూపుగా నియోజకవర్గానికి వచ్చే నాయకుల మాయమాటలు నమ్మే స్థితిలో నియోజకవర్గ ప్రజలు లేరు. ఎవరెన్ని కుట్రలు చేసినా కోదాడ నియోజకవర్గంలో మరోసారి గులాబీజెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. 'సాక్షి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. – కోదాడ

- నిత్యం ప్రజల మధ్యే ఉన్నాను
- కోదాడలో గులాబీ జెండా ఎగరడం ఖాయం
- బీఆర్ఎస్ కోదాడ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్

ఐదు సంవత్సరాల కాలంలో కోట్ల రూపాయల నిధులతో కోదాడ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఆరు మండలాలను అభివృద్ధి చేశాను. కోదాడ పట్టణంలో ప్రాణాంతకంగా మారిన 33 కేవీ లైన్‌ను తీసి వేయించాను. మోతె, మునగాల, నడిగూడెం మండలాలకు కాళేశ్వరం జలాలను రప్పించాను. కోదాడకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్, 100 పడకల వైద్యశాలను మంజూరు చేయించాను. పట్టణంలో రోడ్ల వెడల్పుతో పాటు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయించాను.

కోదాడలో మొదటిసారి బీసీ ఎమ్మెల్యేగా

కోదాడ నియోజకవర్గం 1978లో ఏర్పడితే మొదటిసారి కేసీఆర్ ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా బీసీనైన నాకు అవకాశం వచ్చింది. అందరి ఆశీర్వాదంతో గెలుపొందాను. ఐదు సంవత్సరాలు కులమతాలకు అతీతంగా అందరికీ సేవలందించాను.

అవన్నీ అసత్యాలే..

అవినీతికి పాల్పడ్డానని, దందాలు చేశానని కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. ఒక్క ఆరోపణ నిజమని నిరూపించినా రాజకీయాల నుంచి తప్పుకుంటా. గతంలో కోదాడలో అనేక చీకటి వ్యాపారాలు చేసింది, చేయించింది కాంగ్రెస్ నాయకులే. ఇప్పుడు వారే నాపై ఆరోపణలు చెయ్యడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. దళితబంధు, డబుల్‌బెడ్‌రూం మంజూరులలో ఎలాంటి అవకతవకలు జరగలేదు.

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా..

అభివృద్ధి సంక్షేమ పథకాలతో గడిచిన ఐదు సంవత్సరాలు కోదాడ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశాను. మిగిలిన పనులను పూర్తి చేయడానికి ప్రజలు మరో అవకాశం ఇవ్వాలని కోరుతున్నాను. సీఎం కేసీఆర్ సహకారంతో కోదాడ నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాను.

వారంటీ లేని గ్యారంటీలను నమ్మవద్దు

- హుజూర్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి

పాలకవీడు : బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రాష్ట్రంలో ప్రతీ ఇంటికి అందుతున్నాయని, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన వారంటీ లేని గ్యారంటీ పథకాలను ప్రజలు నమ్మవద్దని హుజూర్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు గుడుగుంట్లపాలెం, యల్లాపురం, సజ్జాపురం, బెట్టితండా, కోమటికుంట తదితర గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదిన్నర ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. మూడు గంటలు కరెంటు ఇచ్చే కాంగ్రెస్ కావాలా.. 24 గంటలు ఇచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలా అనేది ప్రజలు ఆలోచించుకోవాలని కోరారు. మరోసారి బీఆర్ఎస్ గెలిస్తే ఆసరా పింఛన్ల పెంపు, నాలుగు వందలకే గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం వంటి పథకాలు అమలవుతాయన్నారు. కారు గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాగా, పాలకవీడు, బెట్టితండా గ్రామాల్లో పలువురు సైదిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, అప్పిరెడ్డి, రవినాయక్, భిక్షం, వెంకట్‌రెడ్డి, అచ్చమ్మ, సైదిరెడ్డి, రామారావు, రవినాయక్, లక్ష్మీనారాయణ, దాదేఖాన్, రాంబాబు, జాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాలకవీడు : యల్లాపురంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న శానంపూడి సైదిరెడ్డి

బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం

మఠంపల్లి : రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రఘునాథపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మూడవసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడగానే కోట్ల రూపాయలతో రోడ్లు, సాగునీరు, తాగునీటి పథకాలను, విద్యుత్ పనులు చేపట్టి మరింత అభివృద్ధి చేస్తానని, ప్రజలు బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శంకరమ్మ, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ జగన్‌నాయక్, సర్పంచ్ జానీబీ, హాఫీజ్‌ఖాన్, ఇరుగు పిచ్చయ్య, సీతారామయ్య, పుల్లారెడ్డి, బ్రహ్మారెడ్డి, ప్రతాపరెడ్డి, సుధాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం

- హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గరిడేపల్లి : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని హుజూర్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వెలిదండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ ఆయకట్టు పరిరక్షణ కమిటీ కన్వీనర్ మేకల నాగేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ ధనమ్మలతో పాటు వివిధ పార్టీలకు చెందిన 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రైతులు, కార్మికులకు, వ్యవసాయ కూలీలకు అన్ని విధాల అండగా ఉంటామని అన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, యరగాని నాగన్న, గుండు రామాంజీ, చక్రధర్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



గరిడేపల్లి : వెలిదండలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాయకులు



గరిడేపల్లి : ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తిలకం దిద్ది హారతి ఇస్తున్న మహిళలు



హుజూర్‌నగర్ : కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కాంగ్రెస్ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ పార్టీ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి జరిగిందని హుజూర్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మఠంపల్లి మండల కాంగ్రెస్ నాయకులు హనుమా చెన్నానాయక్, బాల్‌సింగ్ నాయక్‌ల ఆధ్వర్యంలో గుర్రంబోడుతండాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ముడావత్ శ్రీను, స్వామి, సక్రూ, బుజ్జా, యాంకు, రవీందర్, కుమార్, బీక్లా, స్వామిదా, మునియా, నాగు, చోకా, దేవుజా తదితరులు సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంజూనాయక్, భీముడు, నాగూ, సక్రూ, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కల్లు గీతకార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

నడిగూడెం : కల్లు గీతకార్మికులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కల్లు గీతకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కల్లు గీత కార్మికుల సంక్షేమ నిధికి రాష్ట్ర బడ్జెట్‌లో ఐదు వేల కోట్లు కేటాయించి ఖర్చు చేయాలని, కల్లు దుకాణాలు ఉన్న ప్రతి గ్రామానికి తాటి చెట్ల పెంపకానికి ఐదు ఎకరాల భూమి కేటాయించాలని, వృత్తిలో ప్రమాదాల నివారణకు సేఫ్టీ మోకులు అందజేయాలని, సభ్యులందరికీ ద్విచక్రవాహనాలు మంజూరు చేయాలని, ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు మంజూరు చేయాలని కోరారు.

కాంగ్రెస్‌కే క్రైస్తవుల మద్దతు

హుజూర్‌నగర్ : దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని క్రైస్తవులు కోరుకుంటున్నారని ఏఐసీసీ మైనార్టీ సెల్ కోఆర్డినేటర్ గద్దపాటి విజయరాజు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి క్రైస్తవుల మద్దతు సంపూర్ణంగా ఉంటుందని చెప్పారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని క్రైస్తవ సంఘాలు కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. సమావేశంలో క్రైస్తవ నాయకులు పాస్టర్ గుండు శ్యామ్యూల్, పాస్టర్లు మీసాల జ్యోతి బాబు, ఉబ్బల్లపల్లి ఇషాక్, చడవ ఏసు పాదం, దుబాసు, యో సోబు, రాజు పాల్గొన్నారు.



కాంగ్రెస్ గ్యారంటీ పథకాలతో అభివృద్ధి సాధ్యం

- కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి

మోతె : కాంగ్రెస్ పార్టీ అమలు చేయబోయే ఆరు గ్యారంటీ పథకాలతో తెలంగాణలో ప్రజలు అభివృద్ధి చెందుతారని కోదాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మావతి అన్నారు. సోమవారం మండలంలోని విభళాపురం, మామిళ్లగూడెం, కొత్తగూడెం, తుమ్మలపల్లి గ్రామాల్లో పద్మావతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు. సోనియాగాంధీ దయతో ఏర్పాటైన తెలంగాణకు తొలి ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ రాష్ట్ర సంపదను దోచుకుని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. అమరవీరుల పోరాటాలతో ఏర్పడ్డ రాష్ట్రంలో నిరుద్యోగులకు మొండిచేయి చూపించాడని అన్నారు. నవంబర్ నెల 30న ప్రతిఒక్కరూ చేయి గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా నాయకుడు మద్ది శ్రీనివాసరెడ్డి, మోతె మండల పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, జెడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ మైనంపాటి గుర్వారెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసుదన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మాతృనాయక్, ఉర్లుగొండ సర్పంచ్ మామిడి అనిత వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి మాజీ సర్పంచ్ నంద్యాల అరుణమ్మ, సీమ చిన వెంకటరెడ్డి, ఎలుగు వీరన్న, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



మోతె : మామిళ్లగూడెంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న పద్మావతి



కోదాడ : చందర్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సర్పంచ్ అంబేద్కర్, నాయకులు

కాంగ్రెస్‌లో చేరిన బీక్యాతండా సర్పంచ్

కోదాడ : కోదాడ మండలంలోని బీక్యాతండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, సర్పంచ్ అంబేద్కర్‌తో పాటు పలువురు నాయకులు సోమవారం కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా చందర్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి 50 వేలకు పైగా మెజార్టీతో విజయం సాధించబోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తవరపు పాండురంగారావు, బాషబోయిన భాస్కర్, వీరేపల్లి సుబ్బారావు, పుల్లూరి అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థికే టీఎమ్మార్పీఎస్ మద్దతు



మాట్లాడుతున్న నాగరాజు

కోదాడఅర్బన్ : కోదాడలో బీఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌కే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని టీఎమ్మార్పీఎస్ కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు బచ్చలకూర నాగరాజు తెలిపారు. సోమవారం కోదాడలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో టీ ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి చింత బాబు మాదిగతో కలిసి ఆయన మాట్లాడారు. దళితులను అన్ని రకాలుగా ఆదరించిన బీఆర్ఎస్‌కే తమ మద్దతు అని, మల్లయ్యయాదవ్‌ను అధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు కందుల విజయ్, నాగేశ్వరరావు, శ్రీనివాస్, అబ్రహం, వినోద్, రాంబాబు, ఉపేందర్, వినయ్, వేణు, శివ, కాశీ, విక్కీ, శ్రీకాంత్, రామారావు, రాజేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి

కోదాడఅర్బన్ : ప్రజా ఉద్యమకారుడు, కోదాడ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి మట్టిపల్లి సైదులును గెలిపించి అసెంబ్లీకి పంపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో జరిగిన సీపీఎం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మతోన్మాద బీజేపీని ఓడించాలన్నారు. సీపీఎం అభ్యర్థిని గెలిపించి, కమ్యూనిస్టులకు ఓట్లు లేవు గెలవరని అన్న వారికి ఎర్రజెండా సత్తా ఏంటో చూపించాలని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బుర్రి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, సత్యనారాయణ, నర్సింహారావు, ముత్యాలు, శంకర్‌రెడ్డి, మండలాల పార్టీ బాధ్యులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలను సోమవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, దీపాలు వెలిగించారు. –సాక్షి నెట్‌వర్క్



మేళ్లచెరువు : శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న డీఎస్పీ ప్రకాశ్



కోదాడఅర్బన్: శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు



నేరేడుచర్ల : విశ్వేశ్వర ఆలయంలో..

